తాతపూడితో గట్టెక్కిన రబీ

- ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిన ప్రభుత్వం
- రూ.6.50 లక్షలతో ఫిబ్రవరిలోనే మరమ్మతులు
- బ్యాంక్ కెనాల్ ద్వారా 10 వేల ఎకరాలకు నీటి సరఫరా
- కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు



తాతపూడి ఎత్తిపోతల పథకం

కపిలేశ్వరపురం: ప్రకృతి వైపరీత్యాలు మినహా రబీ వరిసాగు సజావుగా సాగింది. ప్రభుత్వం ఫిబ్రవరి నెల నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో నిర్వహణాపరమైన సమస్యల నుంచి రబీ పంట గట్టెక్కింది. గత ఖరీఫ్ కోతల కాలంలోనే రబీ అవసరాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేసింది. నీటి ఎద్దడిని ముందే గమనించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా ఫిబ్రవరిలోనే తాతపూడి ఎత్తిపోతల పథకానికి మరమ్మతుల నిమిత్తం రూ.8.80 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తంలో రూ.6.50 లక్షలు ఖర్చు చేసి రబీలో సుమారు 10 వేల ఎకరాలకు నీటిని అందించగలిగారు. రబీ పంట సజావుగా చేతికి అందడంతో ప్రభుత్వం ముందు చూపునకు, అధికారుల చొరవకు కపిలేశ్వరపురం, కె.గంగవరం, తాళ్లరేవు మండలాల రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రబీ సాగు ప్రణాళిక ఇలా...

గోదావరిలోని నీటి లభ్యత సమస్య ఉన్నట్టు ఫిబ్రవరిలోనే అధికారులు గుర్తించారు. ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీ మీటర్ల నీరు అవసరం. రామచంద్రపురం నియోజవర్గంలో 75 గ్రామాల్లో 53,249 ఎకరాలకు 6,65,61,250 మండపేట నియోజవర్గంలో 43 గ్రామాల్లో 47,418 ఎకరాలకు 4,92,72,500 మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,00,667 ఎకరాలకు 11,58,33,750 మిల్లీ మీటర్ల సాగునీరు అవసరం అవుతుందని అంచనా వేశారు. ఆలమూరు నుంచి కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం, మాచర, శ్రీరాంపురం, కోరుమిల్లి మీదుగా కె.గంగవరం మండలం కూళ్ల వైపు బ్యాంక్ కెనాల్ ఉంది. తాతపూడి ఎత్తిపోతల పథకాన్ని సిద్ధం చేసి ఆ కాలువ ద్వారా నీటిని సమర్థవంతంగా అందించగలిగారు.

తాతపూడి పంపింగ్ స్కీం సామర్థ్యమిదీ..

కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, మాచర, టేకి, వాకతిప్ప, కోరుమిల్లి, రామచంద్రపురం మండలంలోని కె.గంగవరం కూళ్ల, యండగండి, పామర్రు గ్రామాల్లోని సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా నీరందిరచగల సామర్థ్యం తాతపూడి ఎత్తిపోతల పథకానికి ఉంది. 1969లో రూ.9.20 లక్షల వ్యయంతో ఈ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. ఆటో ట్రాన్స్‌ఫర్మేషన్ స్టార్టర్స్‌తో హెచ్‌పీ 125 పీహెచ్ 50సి/ఎస్ సామర్థ్యం గల ఏడు పంపులను దీనికి అమర్చారు. 500 ఓల్టుల సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్స్‌తో ఒక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పంపింగ్ స్కీం అనుసంధానమైంది.

పక్కా ప్రణాళికతో సమస్య పరిష్కారం



తాతపూడి ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని, సాగు అవసరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. శాస్త్రీయ కోణంలో ప్రణాళికను మాకు అందజేశారు. వారి సూచనలను పాటించడం ద్వారా సకాలంలో రబీ ఆయకట్టుకు నీరందించగలిగాం. రూ.8.80 లక్షలు మంజూరు చేయగానే మరమ్మతులు ప్రారంభించి నీటి సరఫరాకు సిద్ధం చేశాం. ఫిబ్రవరి 17 నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకూ 80 రోజుల పాటు ఈ పంపింగ్ స్కీం ద్వారా నీటిని తోడి అందించాం.

– విశ్వనాథరాజు, ఏఈ, హెడ్ వర్క్స్

రైతుల పాలిట ఆపద్బాంధవి



రైతులకు నీటి సమస్య తలెత్తినపుడల్లా తాతపూడి ఎత్తిపోతల పథకం వారి పాలిట ఆపద్బాంధవిగా ఉపకరిస్తోంది. రబీలో బ్యాంక్ కెనాల్ పరిధి ఆయకట్టుకు నీటి సమస్య తతలెత్తింది. ఉన్నతాధికారులు ముందస్తు ప్రణాళిక పుణ్యమా అని తాతపూడి పంపింగ్ స్కీం ద్వారా నీరందించి పంటను రక్షించారు.

– పుట్టపూడి అబ్బు, జెడ్పీటీసీ సభ్యుడు, కపిలేశ్వరపురం

క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నేడు(మంగళవారం) మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని చైర్‌పర్సన్ కోరారు.

ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



వెదురుమూడి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజ చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: వెదురుమూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో ధ్వజస్తంభంతో పాటు ద్వారపాలకులైన జయ, విజయ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఖండవిల్లి వెంకట సూర్య జగన్నాథాచార్యులు, వాడపల్లి నరసింహాచార్యులు, సుదర్శనం సూర్యనారాయణాచార్యుల పర్యవేక్షణలో యాగశాల ప్రవేశం, గోపూజ, అగ్ని ప్రతిష్ఠాపన పూజలు చేశారు. ఈ నెల 31న ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ పూజలు, అన్నసంతర్పణ నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పీవీవీ సత్యనారాయణమూర్తి తెలిపారు.

నేత్రదానం



సత్యనారాయణ (ఫైల్)

కె.గంగవరం: మండలంలోని పామర్రు గ్రామానికి చెందిన అరిసెట్టి సత్యనారాయణ (79) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరికి కంటి చూపు ప్రసాదించాలనే ఉద్దేశంతో వారి కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, నాగార్జున, పద్మావతి, వెంకటలక్ష్మి తదితరుల తండ్రి సత్యనారాయణ కార్నియాలను కాకినాడకు చెందిన బాదం బాలకృష్ణ కంటి బ్యాంకు దానం చేశారు. వైద్య సిబ్బంది సత్యనారాయణ ఇంటికి చేరుకుని ఆయన కార్నియాలను సేకరించి భద్రపరిచారు. నేత్రదానం చేసేందుకు సహకరించిన వారి కుమారులు, కుమార్తెలను పలువురు అభినందించారు.

టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం: పురపాలక పరిధిలో ఒకటో వార్డు కొత్తూరు టిడ్కో కాలనీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయలో సోమవారం జరిగిన స్పందనలో ఆర్డీవో పి.సింధూ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో కాలనీలో ఇటీవల ఈగల సమస్య అధికంగా ఉందని, దానికి కారణంగా ఉన్న కోళ్ల ఫారం నుంచి అక్కడి నుంచి తొలగించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందించాలమని సిద్ధూ తెలిపారు. రామచంద్రపురం డివిజన్ ఐఎఫ్‌టీయూ కార్యదర్శి ఎం.రాజు, ఏఐకేఎంఎస్ నాయకులు అంబటి కృష్ణ, వెంకటరమణ, టీశ్రీనివాస్, ఎం శ్రీనివాస్, విజయలక్ష్మి, కుమార్, నవీన్ పాల్గొన్నారు.

మట్టి తరలింపుతో నరకప్రాయంగా రోడ్లు



ప్రయాణాన్ని నరకప్రాయం చేస్తున్న యనమదల రోడ్డు

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో లారీలు, ట్రాక్టర్లతో మట్టి తరలింపు జోరుగా సాగుతుండటంతో వాటిపై నుంచి జారిపడుతున్న మట్టి పెళ్లల కారణంగా గ్రామం నుంచి తాటిపల్లి, నరసాపురపుపేట, రామచంద్రపురం రోడ్లపై ప్రయాణికుల వాహనాలు జారి పడిపోతూ ప్రయాణం నరకప్రాయంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు మట్టి తరలింపుపై నియంత్రణ విధించాలని కోరుతున్నారు.

మహానాడుకు భారీ స్పందన

కపిలేశ్వరపురం: రాజమహేంద్రవరంలో నిర్వహించిన టీడీపీ మహానాడులో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టో ప్రజల బతుకుకు నమ్మకం కలిగించిందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మహానాడుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. చంద్రబాబు ప్రకటించిన వరాలు చరిత్రలో ఎప్పుడూ చూడలేదని ప్రజలు సంబరపడుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ళ అన్నారు.

జూన్ 1న రైతుల ఖాతాల్లో నగదు జమ



చోడవరంలో రైతు భరోసా కార్యక్రమానికి రైతులను ఆహ్వానిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత రైతు భరోసా జూన్ 1 న మండలంలోని 9064 మంది రైతుల ఖాతాల్లో రూ.498.52 లక్షలు జమ కానున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. జూన్ 1న జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం రావులపాలెంలోని మల్లిడి కనికిరెడ్డి కన్వెన్షన్ హాలులో జిల్లా అధికారులు ఏర్పాటు చేశారన్నారు. అదే విధంగా మండలంలోని ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాల వద్ద రైతు భరోసా పంపిణీ కార్యక్రమం లైవ్ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులకు, రైతులకు కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వానాలు పంపుతున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.దుర్గాబాయి సోమవారం విలేకరులకు తెలిపారు. తమకు అందిన సమాచారమేరకు ద్రాక్షారామ శ్మశాన సమీపాన పేకాడుతున్న వారిపై దాడి చేసి వారి నుంచి 52 పేకముక్కలు, రూ.10,250 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న వారిపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఆదివారం పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.దుర్గాబాయి సోమవారం విలేకరులకు తెలిపారు. పేకాడుతున్న వారి నుంచి రూ.3,330 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆగిన సర్వర్లు.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

ఆలమూరు: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో కక్షిదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు కార్యాలయానికి విచ్చేశారు. అయితే రిజిస్ట్రేషన్ అధికారులు కేవైసీతో పాటు ప్రాథమిక వివరాలను నమోదు చేసుకున్నారు. అయితే ముద్రణకు సంబంధించిన సర్వర్లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు జరగలేదు. సాయంకాలం వరకూ నిరీక్షించిన కక్షిదారులు నిరాశతో వెనుదిరిగారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి ఏర్పడిన సాంకేతిక లోపం వల్లే ఈ పరిస్థితి తలెత్తి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం

ఆలమూరు: విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ ప్రజలకు నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామని మండపేట ఏడీఈ జి.తిరుమలరావు అన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికై దరఖాస్తు చేసుకున్న సందర్భంగా సోమవారం ఆయన స్థానిక గణేష్ కాలనీలో పర్యటించారు. 33 కేవీ విద్యుత్ లైన్‌ను సోమవారం ఆయన పరిశీలించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరచూ సంభవిస్తున్న ఈదురుగాలులు, వర్షాల వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్లలో అదనపు సిబ్బందిని నియమించామన్నారు.

పాల వెల్లువతో పాడి రైతులకు మేలు



జగనన్న పాలవెల్లువపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ, కూళ్ల, పామర్రు, సుందరపల్లి గ్రామాల్లో సోమవారం పామర్రు పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో జగనన్న పాలవెల్లువపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ పంపన నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. అమూల్ సహకారంతో ఆర్‌బీకే పరిధిలో పాలకేంద్రాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఇప్పటికే వలంటీర్లు పాడి రైతుల వివరాలను యాప్ ద్వారా సేకరిస్తున్నారని తెలిపారు. ఈ కేంద్రాలకు పాలను ఇస్తే అధిక ధర ఇవ్వడంతో పాటు 10 రోజులకోసారి సొమ్ములు జమ చేయడం, ఉచిత పశుబీమా సౌకర్యం, ఉపాధిహామీ పథకం ద్వారా పశుగ్రాసం సాగు చేయడం వంటి లాభాలు ఉన్నాయని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువైద్యాధికారి బిందు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంటకాలువలు బాగు చేయాలి



మొగలిపాలెంలో పూడిక పెరిగిపోయి మెరకగా మారిన పంటకాలువ

కాజులూరు: వరి పొలాలకు సాగునీరు అందించే పంటకాలువల్లో పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు. మరో వారం రోజుల్లో గోదావరి నుంచి డెల్టాకు కాలువనీరు విడుదల కానుండటంతో తొలకరి సాగు పనులకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే పంటకాలువల్లో పూడికలు పెరిగిపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడతాయని మండల గ్రామాలకు చెందిన పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో ఖరీఫ్, రబీ సాగు ప్రారంభానికి ముందే ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు ప్రధాన కాలువలు, పంట కాలువల తవ్వకం పనులు నిర్వహించేవారు. ఈ ఏడాది దాళ్వా కోతల సమయంలో వ్యవసాయ పనుల సీజన్ కారణంగా ఉపాధి పనులు నిలుపుదల చేసిన అధికారులు నేటికి తిరిగి ప్రారంభించలేదు. దీంతో పూడికలు పెరిగిపోయి పంటకాలువలు మూసుకుపోయి ఉన్నాయని ఫలితంగా పొలాలకు సాగునీరందే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువలను తవ్వించి సాగు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు టేకుమూడి దుర్గారావు, కర్రి రామరెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితర రైతులు కోరుతున్నారు.

స్టాక్ పాయింట్‌కు పాఠ్య పుస్తకాలు



స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

మండపేట: పాఠశాలలు తెరవకముందే జగనన్న విద్యాకానుక పాఠ్యపుస్తకాలు స్టాక్ పాంయిట్‌కు చేరుకున్నాయి. పట్టణంలోని గౌతమి మున్సిపల్ హైస్కూల్లోని స్టాక్ పాయింట్‌కు వచ్చిన బుక్స్, ఇతర సామగ్రిని సోమవారం ఎంపీడీఓ ఐ.రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే జగనన్న విద్యాకానుక కిట్లు స్టాక్ పాయింట్‌కు చేరుకుంటున్నాయన్నారు. విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు, విద్యాసంవత్సరం శుభారంభానికి జగనన్న విద్యాకానుక కిట్లు దోహదం చేస్తాయన్నారు. మండపేట పట్టణ, మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 7,005 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేయనున్నట్లు వివరించారు. ఎంఈఓ ఎస్. రామచంద్రరావు మాట్లాడుతూ యూనిఫాం, షూలు, సాక్స్‌లు, 1వ తరగతి, 6వ తరగతి విద్యార్థులకు డిక్షనరీలు, 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు, 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్‌ను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. పాఠ్య పుస్తకాల్లో ఒక స్పెల్ మినహా మిగిలిన పుస్తకాలు, ఇతర సామగ్రి స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయన్నారు. 60 వేల పాఠ్య పుస్తకాలకు గాను 45 వేలు వచ్చాయని, మిగిలినవి త్వరలో స్టాక్ పాయింట్‌కు చేరుకుంటాయని వెల్లడించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పూర్తిస్థాయిలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయనున్నట్టు ఎంఈఓ రామచంద్రరావు తెలిపారు.

సీసీఆర్‌సీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



గొల్లపాలెంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ ప్రసన్నమౌనిక

కాజులూరు: రాష్ట్రంలో కౌలు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీఎం జగనన్న ప్రభుత్వం అందజేస్తున్న సీసీఆర్‌సీ కార్డులను ప్రతి కౌలు రైతు సద్వినియోగం చేసుకోవాలని పార్టీ మండల మహిళా విభాగం నేత, గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అన్నారు. సోమవారం గొల్లపాలెం ఆర్‌బీకేలో మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంటల సాగుదారుల చట్టం-2019 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పంటల సాగుదారుల హక్కుపత్రం (సీసీఆర్‌సీ కార్డు)తో భూ యజమానులకు ఎటువంటి నష్టం కలగదని కేవలం 11 నెలల కాలపరిమితికి మాత్రమే కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డు ఇస్తారన్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకు వచ్చిందని ఈ కార్డు ద్వారా భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కౌలురైతులు ఈ సీసీఆర్‌సీ కార్డులు పొందడం ద్వారా పంటల నమోదు చేయించుకుని ధాన్యాన్ని సులభతరంగా విక్రయించుకోవటంతో పాటు బ్యాంకుల నుంచి పంటరుణాలు, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు కౌలురైతులకు అధికారులు, నాయకులు సీసీఆర్‌సీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, వీఆర్వో వరలక్ష్మి, వీఏఏలు వనుం రమ్య, శిరీష, వీఆర్ఏ కృష్ణ పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరల సాగులో సస్యరక్షణ చర్యలు

ఏఓ బలుసు రవి



తోటకూర



పాలకూర

కె.గంగవరం: విటమిన్లు, లవణాలు, మాంసకృత్తులు, పీచుపదార్థాలు మెండుగా ఉండే ఆకుకూరలకు ఈ మధ్య డిమాండ్ బాగా పెరిగింది. దీనికి తోడు స్వల్ప వ్యవధిలో పంట చేతి కందుతుంది. ఆకుకూరలను తినడం ద్వారా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. దీంతో పాటు ఆకుకూరల సేద్యం ద్వారా ఆదాయం కూడా పెరుగుతుంది. ఆకుకూరల సాగు మెళకువలపై కె.గంగవరం ఏఓ ఎస్.బలుసు రవి అందిస్తున్న సూచనలు.

నేల తయారీ.. ఎరువులు

ముఖ్యంగా ఆకుకూరల సాగుకు నేల తయారీ చాలా ముఖ్యం. మెత్తటి దుక్కు వచ్చే వరకు లోతు దుక్కితో పాటు 3, 4 సార్లు సాధారణ దుక్కి చేయాలి. దుక్కిన తరువాత నేలలో మట్టి పెళ్లలు లేకుండా చదును చేసుకోవాలి. నేలను సమాంతరంగా సిద్ధం చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల పేడ, 300 కిలోల వేపపిండి, 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 10 కిలోల జింకు సల్ఫేట్, రెండు కిలోల గ్రాన్యుబోర్, 100 కిలోల శుద్ధి చేసిన ట్రైకోటెర్మా, 20 కిలోల యూరియా, 20కిలోల పొటాష్ వేసుకుని ఆకుకూరలను విత్తుకోవాలి.

తోట కూర..

ఈ విత్తనాల చాలా చిన్నవిగా ఉంటాయి. వీటిని ఇసుకతో కలిపి తయారు చేసుకున్న నేలలో విత్తుకోవాలి. ఎకరానికి 800 గ్రాములు సరిపోతాయి. 10 కిలోల ఇసుకను కలిపి మడులపై పలచగా చల్లుకొని పలుచని పొరలా మెత్తటి మట్టి లేదా ఇసుకతో కప్పాలి.

కొత్తిమీర...

కొత్తిమీర విత్తుకునేటప్పుడు విత్తనాన్ని రెండు బద్దలుగా చేయాలి. లేకపోతే గింజ ఆలస్యంగా మొలకెత్తి మొలకశాతం దెబ్బతింటుంది. దీనికి కోసం గింజలను నేలపై పోసి సున్నితంగా నేలకేసి రుద్దాలి.

మెంతికూర..

ఇది పప్పు జాతి పంట. మొదటిసారి పొలంలో విత్తే ముందు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టిస్తే వాతారణంలోని నత్రజనిని గ్రహించిన దానికి తోడ్పడుతుంది. దీని ద్వారా మెంతికూర మొక్కల పెరుగుదల బాగుంటుంది.

పాలకూర..

విత్తనాలను 3.4 సెం.మీ లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువ అయితే మొలక సరిగా రాదు. ఎకరానికి నాలుగు లేదా ఐదు కిలోల విత్తనాలు సరిపోతాయి. పాలకూర పంట కూడా త్వరగా చేతికందుతుంది.

కరివేపాకు..

విత్తనాలను పండు నుంచి వేరు చేసిన వెంటనే నేలలో విత్తుకోవాలి. ఆరిన తరువాత విత్తితే మొలక శాతం బాగా తగ్గిపోతుంది. విత్తని 48 గంటలలోపు నేలలో పదును చూసుకుని లీటరు నీటికి నాలుగు లీటర్ల పిండి మిథాలిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట తొలి దశలో కలుపును నివారించుకోవచ్చు. ఇలాంటి సస్యరక్షణ చర్యలు చేపడితే ఆకుకూరల్లో చీడపీడలు నివారించుకుని మంచి దిగుబడులు సాధించుకోవచ్చు.

పనులు వేగవంతం చేయండి

యానాం: నియోజకవర్గ పరిధిలో పీడబ్ల్యూడీ శాఖాపరంగా చేపట్టే వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేయాలని ఆర్ఏఓ మునిస్వామి కోరారు. సోమవారం యానాం పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కొత్తగా నియమితులైన కె.వీరాస్వేంతో వివిధ అంశాలపై చర్చించారు. పూర్తి స్థాయిలో ఈఈ లేకపోవడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన రోడ్లు, డ్రైన్లు తదితర పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి

కొత్తపేట: స్థానిక ఏనుగులమహల్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు కర్రెళ్ల రామాంజనేయులు (50) మృతి చెందాడు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామాంజనేయులు, అతని సోదరుడు కర్రెళ్ల సూర్య భాస్కరరావు కలసి రాజమహేంద్రవరంలో జరిగిన టీడీపీ మహానాడుకు హాజరై తిగిరి బైక్‌పై వస్తుండగా రాత్రి ఏనుగులమహల్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై ఉన్న కొబ్బరాకుపై నుంచి వెళ్లడంతో అదుపుతప్పి పడిపోయారు. రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతని సోదరుడు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని సోదరుడు సూర్యభాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు.

సీబీఎస్ఈకి రెడీ..

- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- సిలబస్ బోధనకు కానరాని సంసిద్ధత
- యానాంలో ప్రారంభం కాని టీచర్లకు శిక్షణ

యానాం: పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం యానాంలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న యానాంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని పుదుచ్చేరి విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఉపాధ్యాయులు సీబీఎస్ఈ సిలబస్ బోధనలో ఎంతవరకూ సంసిద్ధత కలిగి ఉన్నారని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠ్య ప్రణాళికకు సంబంధించి శిక్షణా కార్యక్రమాన్ని ఇంకా ప్రారంభించకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. యానాంకు ప్రత్యేక విద్యా బోర్డు లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ విద్యా బోర్డునే ఇన్నాళ్లు అనుసరిస్తూ వచ్చింది. 6 నుంచి 10వ తరగతి వరకూ ఏపీ స్టేట్ సిలబస్‌నే అమలు చేశారు. ఆ విధంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సైతం ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్‌సీ ద్వారానే జరిగేవి. మొత్తం పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం 4 రీజియన్‌లలో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి ఉన్నాయి. వీటికి ప్రత్యేక బోర్డులు లేకపోవడంతో యానాం ఏపీ బోర్డును, మాహే కేరళ బోర్డును, కారైకల్, పుదుచ్చేరి తమిళనాడు విద్యా బోర్డులను అనుసరిస్తూ వస్తున్నాయి. 2015–16 నుంచి 1 నుంచి 5వ తరగతి వరకూ యానాంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు జరుగుతుంది. ప్రస్తుతం ఉన్నత తరగతులైన 6 నుంచి 9వ తరగతులకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతుల్లో సీబీఎస్ఈ కరిక్యులమ్‌ను అమలు చేయనున్నారు.

మొదలు కాని శిక్షణ

నూతనంగా ఉన్నత తరగతుల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తున్న నేపథ్యంలో సీబీఎస్ఈ విద్యా ప్రణాళికపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పుదుచ్చేరి విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. అయితే గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. 6 నుంచి 11 వరకు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం కాలేదు. జూన్ 14 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఉన్నత తరగతులకు సీబీఎస్ఈ సిలబస్ ద్వారా తరగతులు బోధించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో యానాంలో 74 మంది టీజీటీలకు సీబీఎస్ఈపై శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉంది. ఈ తరగతులు యానాంలోనే నిర్వహించాలని పలువురు టీచర్లు కోరుతున్నారు. యానాంలో సీబీఎస్ఈ అమలు చేయనున్న నేపథ్యంలో విద్యాశాఖ ఇప్పటికే పాఠశాలలకు సీబీఎస్ఈ గుర్తింపునకు సంబంధిత సంస్థకు వివిధ ఫైర్ అండ్ బిల్డింగ్ సేఫ్టీ డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకుంది. ప్రతి విద్యా సంవత్సరం సీబీఎస్ఈ అఫిలియేషన్ పొందాల్సి ఉంటుంది. ఇప్పటికే యానాంలోని 8 ప్రభుత్వ హైస్కూల్స్‌కు సంబంధించి ఫార్మెట్ ప్రకారం దరఖాస్తు చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ బెంగళూరు నుంచి పాఠ్య పుస్తకాలు రానున్నాయని అధికారులు చెబుతున్నారు.

అందరూ సిద్ధం కావాలి



యానాంలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి నూతన విద్యా విధానం అమలు కానుంది. ఆరో తరగతి నుంచి 9 వరకూ, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీబీఎస్ఈ అమలవుతుంది. టీచర్లకు శిక్షణ తరగతులు యానాంలోనే నిర్వహించే విధంగా అధికారులు ఆలోచిస్తున్నారు. స్కూల్స్ తెరిచే నాటికి బోధనకు సిద్ధమవుతారని భావిస్తున్నాం. సీబీఎస్ఈ పాఠ్య పుస్తకాలు సైతం వస్తున్నాయి.

– పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, విద్యాశాఖాధికారి, యానాం